## క్లుప్తంగా

### కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

జి.సిగడాం: స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఐ.ప్రమీల ఆదివారం తెలిపారు. ఆసక్తి గల బాలికలు తల్లిదండ్రుల ఆధార్, బ్యాంకు ఖాతా, రేషన్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్ ద్వారా ఏప్రిల్ 11లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### సీఎం రిలీఫ్ ఫండ్ సాయం అందజేత



చెక్ అందజేస్తున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్

జి.సిగడాం : మండలంలోని వాండ్రంగి గ్రామానికి చెందిన డబ్బాడ సురేంద్రకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన రూ.1,70,416 చెక్‌ను ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆదివారం పార్టీ కార్యాలయంలో కుటుంబ సభ్యులకు అందజేశారు. సురేంద్ర గత ఏడాది జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయాలపాలయ్యాడు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బూరాడ వెంకటరమణ, వాండ్రంగి సర్పంచ్ సాకేటి నాగరాజు, మాజీ సర్పంచ్ సనపల త్రినాథరావు, బొట్ల నాగేశ్వరరావు, డబ్బాడ తవుడు పాల్గొన్నారు.

### రక్తదాతలే ప్రాణదాతలు



రక్తదాన శిబిరంలో దాతలు

రణస్థలం : గ్రామీణ ప్రాంతమైనప్పటికీ మండు వేసవిని సైతం లెక్కచేయకుండా రక్తదానం చేయడానికి ముందుకు వచ్చిన ప్రతిఒక్కరూ ప్రాణదాతలేనని ఇడదాసుల విద్యా ఆరోగ్య ఫౌండేషన్ గౌరవాధ్యక్షుడు ఇడదాసుల వెంకట సత్యనారాయణ అన్నారు. రణస్థలంలోని సూర్య ఆసుపత్రి ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 95 మంది స్వచ్ఛందంగా రక్తదానం చేయడానికి ముందుకు రావడం హర్షణీయమన్నారు. అనంతరం సేకరించిన రక్తాన్ని న్యూ శ్రీకాకుళం బ్లడ్ బ్యాంక్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఇ.తిరుపతిరాజు, వైద్యులు యశ్వంత్, జె.ఆర్.పురం సర్పంచ్ బవిరి రమణ, వైస్ ఎంపీపీ రాయపురెడ్డి భుజంగరావు, గ్రామపెద్దలు మజ్జి రమేష్, రాయపురెడ్డి శ్రీనివాసరావు, మిండ్రాన రామారావు, దన్నాన రమణ, పసుపురెడ్డి సురేష్, చోడిశెట్టి చంద్రశేఖర్, బ్లడ్ బ్యాంక్ మేనేజర్ తొత్తడి మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

### ఆధ్యాత్మిక భాండాగారం రామాయణం



నరసింహమూర్తిని సత్కరిస్తున్న సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: ఆధ్యాత్మిక భాండాగారమైన రామాయణాన్ని ప్రతిఒక్కరూ చదివి స్ఫూర్తిపొందాలని ప్రవచనకర్త నిష్టల నరసింహమూర్తి అన్నారు. నగరంలోని పాలకొండ రోడ్డులో ఉపనిషన్మందిరంలో ఆదివారం 'రామాయణ రహస్యాలు' అనే అంశంపై ఆధ్యాత్మిక ప్రసంగం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగవంతుడు మానవులతో కలిసి మెలిసి ఉంటూ లోక కల్యాణం కోసం కృషి చేయడమే రామాయణమన్నారు. అనంతరం వక్తను మందిరం సభ్యులు సత్కరించారు. కార్యక్రమంలో శరత్‌బాబు, పతంజలి శాస్త్రి, నిక్కు అప్పన్న, బలివాడ మల్లేశ్వరరావు, విశ్వేశ్వరరావు, మోహనరావు, వి.కామేశ్వరరావు, ఈశ్వరరావు, తౌడు, సరస్వతి, అనూరాధ, బాబూరావు పాల్గొన్నారు.

### మూలన పడేశారు!



చల్లపేట ఆర్బీకేలో మూలకు చేరిన కియోస్కో యంత్రం

గార: అన్నదాతకు అన్ని విధాలా తోడు ఉండే కియోస్కో యంత్రాలు మూలకు చేరుతున్నాయి. వ్యవసాయం, ఉద్యానవన వంటి అన్ని రంగాలపై సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు గత ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో వీటిని ఏర్పాటు చేసింది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతో పాటు సాగుకు సంబంధించిన సమాచారాన్ని ఈ యంత్రాల ద్వారా సిబ్బంది ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించేవారు. 2021లో గార మండలంకు 25 యంత్రాలను కేటాయించారు. ప్రస్తుతం ఇవన్నీ నిరుపయోగంలో ఉన్నాయి.

# మండుటెండలో.. కూల్ కూల్!

- పుచ్చకాయలకు భలే డిమాండ్
- పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ఊపందుకున్న విక్రయాలు
- రోడ్ల వెంట తాత్కాలిక షాపులు
- రూ.వేలల్లో వ్యాపారం



రోడ్డు పక్కన పుచ్చకాయలు అమ్ముతున్న దృశ్యం

ఎచ్చెర్ల: వేసవి ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతోంది. ఉదయం 9 గంటల నుంచి సూరీడు సుర్రుమంటున్నాడు. బయటకు రావాలంటేనే భయపడేలా ఎండలు మండుతున్నాయి. ఉక్కపోత, వేసవితాపంతో దాహార్తితో ప్రజలు అల్లాడిపోతున్నారు. మార్చిలోనే ఇలా ఉందంటే మే నెలలో పరిస్థితి ఇంకెలా ఉంటుందోనంటూ ఇప్పటి నుంచే ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో భానుడి భగభగల నుంచి ఉపశమనం పొందేందుకు పుచ్చకాయలు(వాటర్ మిలాన్)ను విరివిగా కొనుగోలు చేస్తున్నారు. 92 శాతం నీరుండే పుచ్చకాయకు ప్రస్తుతం విపరీతంగా డిమాండ్ పెరిగింది. మండుటెండలో అలసిన శరీరాలకు పుచ్చకాయ తింటే వెంటనే సాంత్వన చేకూరుతుంది. జనం దాహార్తిని తీర్చేందుకు రోడ్ల పక్కన పుచ్చకాయలు గుట్టలుగుట్టలుగా సిద్ధంగా ఉన్నాయి. తాత్కాలిక శిబిరాలు సిద్ధం చేసి తోపుడు బండ్లపై పుచ్చకాయలను జోరుగా విక్రయిస్తున్నారు.

**పెద్ద ఎత్తున వ్యాపారం..**

ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధిలోని దుకాణాల్లో పెద్ద మొత్తంలో హోల్‌సేల్ పుచ్చకాయల వ్యాపారం సాగిస్తున్నారు. వ్యాపారులు ఇక్కడ నుంచి చుట్టుపక్కల మండలాలకు సరఫరా చేస్తున్నారు. మరికొందరు పుచ్చకాయలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకువస్తు ఇక్కడ వ్యాపారం చేస్తున్నారు. ఇలా తెచ్చిన పుచ్చకాయలను చిన్న చిన్న దుకాణాలకు రిటైల్‌గా విక్రయిస్తున్నారు. వీటితో పాటు తోపుడు బండ్లపై ఎక్కడికక్కడ పుచ్చ ముక్కలు అమ్ముతున్నారు.

**సైజ్ బట్టి ధర..**

రిటైల్‌గా పుచ్చకాయ సైజును బట్టి ధర నిర్ణయిస్తున్నారు. కిలో రూ.30 చొప్పున కాయ రూ.100, రూ.150, రూ.200 వరకు ధర పలుకుతోంది. మరీ చిన్నవైతే కాస్త తక్కువ ధరకు ఇచ్చేస్తున్నారు. ముక్కలుగా రూ.10, రూ.20 లెక్కన అమ్ముతున్నారు.

**ఆరోగ్యానికి మంచిది**



పుచ్చకాయలో 92 శాతం నీరు ఉండటంతో శరీరానికి చల్లదనం చేకూరుతుంది. పోషకాలు కూడా ఎక్కువే. చిన్న పిల్లలు ఎక్కువగా తింటే జ్ఞాపక శక్తి, రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. రక్తపోటు, కొలెస్ట్రాల్ కూడా తగ్గుతుంది. పుచ్చకాయలో ఉండే పోషకాలు గుండె ఆరోగ్యానికి తోడ్పతాయి. వేసవిలో పుచ్చకాయ తినడం ఆరోగ్యానికి మంచిది.

– ఇప్పిలి చిట్టిబాబు, హెల్త్ అసిస్టెంట్, పొన్నాడ

**వ్యాపారం ఊపందుకుంది**



ప్రధాన కూడళ్ల వద్ద తోపుడు బండ్లతో వ్యాపారాలు చేస్తున్నాం. ఎండలు పెరుగుతుండటంతో పుచ్చకాయల వ్యాపారం ఊపందుకుంది. కాయ రూ.100 నుంచి రూ.200 వరకు విక్రయిస్తున్నాం. మంచి గిరాకీ ఉండటంతో లాభాలు కూడా వస్తున్నాయి.

–సీహెచ్ నారాయణరావు, వ్యాపారి

## సమాజాన్ని అధ్యయనం చేయాలి



ఉగాది పురస్కారాలతో విజేతలు, నిర్వాహకులు

శ్రీకాకుళం కల్చరల్: సాహిత్య రంగంలో రాణించాలనుకునే కవులు, రచయితలు తప్పనిసరిగా సమాజాన్ని అధ్యయనం చేయాలని, అప్పుడే వారిలో సాహిత్యం పట్ల అవగాహన కూడా పెరుగుతుందని కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం శ్రీకాకుళం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేమన కవితా నిలయం (శ్రీకాకుళం), తపస్వి మనోహరం (హైదరాబాద్) సంయుక్త నిర్వహణలో విశ్వావసు నామ ఉగాది–2025 పురస్కారాలను ప్రదానం చేశారు. ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో విజేతలు పద్మావతి రాంభక్త (మెతుకు వెలుగులు), యాములపల్లి నరసిరెడ్డి (శిలా వృక్షం), వైరాగ్యం ప్రభాకర్ (ఆకాశమంత), బగాది వెంకటరావు (బగాది బాసలు), వైతాళీయ కుచేలోపాఖ్యానం (మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ), కడలి కవితా ప్రసూనాలు (కడలి ప్రకాశరావు)లకు నగదు పారితోషికాలు అందించి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సభ అధ్యక్షుడు మహ్మద్ రఫీ (ఈవేమన), సురంగి మోహనరావు, బుర్రి కుమారరాజు, బలివాడ తేజస్విలు ప్రసంగించారు. కార్యక్రమంలో కవులు, రచయితలు పాల్గొన్నారు.

### స్వాతంత్య్ర వీరుల ఆశయసాధనకు కృషి



భగత్‌సింగ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఏఐవైఎఫ్ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): స్వాతంత్య్ర సమరయోధులు, విప్లవ యువ కిశోరులు భగత్‌సింగ్‌లాంటి మహనీయుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారిక కార్యక్రమంగా నిర్వహించాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బొత్స సంతోష్, కొన్న శ్రీనివాస్ కోరారు. ఆదివారం శ్రీకాకుళం క్రాంతి భవన్‌లో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 94వ వర్ధంతి సందర్భంగా భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోరాట వీరుల స్ఫూర్తితో యువజన సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటాలు కొనసాగిస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రాజకీయ స్వలాభం కోసం కుల మతాల మధ్య చిచ్చు పెడుతోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ యువత శ్రమను కార్పొరేట్ రంగాలకు ఊడిగం చేసేలా చర్యలు తీసుకోవడం దారుణమన్నారు. దేశానికి వెన్నెముక లాంటి రైతులను సైతం ఆందోళన బాట పట్టేలా చేసిన ఘనత బీజేపీకే దక్కుతుందన్నారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలన్నారు. కార్యక్రమంలో సంఘ జిల్లా ఉపాధ్యక్షులు రవి, జి.వసంత్, బాలకృష్ణ, హరి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలి



తిరుపతిరాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

శ్రీకాకుళం : విద్యార్థులు నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని పారిశ్రామికవేత్త, విజయనగర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ చైర్మన్ దాట్ల తిరుపతిరాజు అన్నారు. స్థానిక గాయత్రి కాలేజీ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఆదివారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి వ్యక్తిత్వంతో మెలిగి తల్లిదండ్రులు, గురువులు, కళాశాలకు పేరు తీసుకురావాలన్నారు. అనంతరం కళాశాల టాపర్లను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో గురజాడ విద్యాసంస్థల అధినేత జి.వి.స్వామినాయుడు, ప్రిన్సిపాల్ పులఖండం శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.వి.వి.సత్యనారాయణ, న్యాయవాది విజయ, రాఘవరాజు, రంగారావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# వయోజనులకు ఉల్లాస్ పరీక్షలు

- సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యంగా నిర్వహణ
- పర్యవేక్షించిన అధికారులు



గార: నిజామాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలలో 'ఉల్లాస్' పరీక్షను పరిశీలిస్తున్న అధికారులు

గార: వయోజన విద్యలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వయోజనులకు ఇటీవల రాత్రి పూట బడులు నిర్వహించగా.. ఉల్లాస్ పేరిట ఆదివారం తొలి పరీక్ష నిర్వహించారు. జాతీయ సార్వత్రిక విద్యా పీఠం ఆధ్వర్యంలో వయోజన విద్యాశాఖ, వెలుగు సంయుక్తంగా చేపట్టిన ఈ పరీక్షలకు గార మండలంలో 2241 మంది మహిళలు హాజరయ్యారు. మండలంలో 90 శాతం మేర హాజరయ్యారని అధికారులు చెబుతున్నారు. నిజామాబాద్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరిగిన పరీక్షను వయోజన విద్యా ఉపసంచాలకులు ముద్దాడ వెంకటరమణ, ఏపీవో బి.బాలచందర్, వెలుగు ఏపీఎం సుజాత పర్యవేక్షించారు. రెండవ పరీక్షలను త్వరలోనే నిర్వహిస్తామని అధికారులు తెలిపారు.

**పక్కాగా నిర్వహణ..**

ఎచ్చెర్ల: లావేరు మండలంలో అభ్యాసకులకు ఉల్లాస్ పరీక్షను పకడ్బందీగా నిర్వహించినట్లు డిప్యూటీ వయోజన విద్య పరిశీలకుడు కె.దొరబాబు అన్నారు. మండలంలో పరీక్ష జరుగుతున్న పలు కేంద్రాలను ఆయన పర్యవేక్షించారు. పరీక్షల నిర్వహణ పక్కాగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో డీఏఈ ఎం.వెంకటరమణ, ఏఈ బి.బాలచంద్ర, సెర్ప్ డిపార్ట్‌మెంట్ మండల ప్రత్యేకాధికారి కె.శ్రీగౌరి, ఏపీఎం బి.వి.సుబ్బయ్యనాయుడు, సీసీ ఎస్.రమేష్ పాల్గొన్నారు.

**అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలి**

జి.సిగడాం: గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చిర్రా లక్ష్మి, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు అన్నారు. మండల వ్యాప్తంగా ఆదివారం ఉల్లాస్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ చదవడం, రాయడం నేర్చుకోవాలన్నారు.

**సంపూర్ణ అక్షరాస్యతకు..**

రణస్థలం: మండల పరిధిలో పలు కేంద్రాల్లో 1280 మందికి ఉల్లాస్ పరీక్షలు నిర్వహించామని ఏపీఎం మాధవీలత తెలిపారు. జె.ఆర్.పురం పరీక్ష కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రారంభించిన వయోజన అక్షరాస్యత పథకం ఉల్లాస్ అని వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యులైన మహిళలను అక్షరాస్యులుగా మార్చడమే పథకం లక్ష్యమని తెలిపారు.



ఎచ్చెర్ల: లావేరు మండలంలో పరీక్షలను పరిశీలిస్తున్న అధికారులు



జి.సిగడాం: సంతవురిటిలో పరీక్షలు రాస్తున్న వయోజనులు



రణస్థలం: ఉల్లాస్ పరీక్షలు రాస్తున్న మహిళలు

### ఎండ ఎఫెక్ట్




ఎండలు భగ్గుమంటున్నాయి. అత్యవసరమైతే తప్ప బయటకు రావాలంటేనే జనం భయపడుతున్నారు. వివిధ పనులపై బయటకు వచ్చే వారు సైతం ఎక్కడ నీడ దొరికినా కాసేపు ఆగి సేద తీరుతున్నారు. ఈ క్రమంలో పాత్రునివలస బ్రిడ్జి కింద హైవే పెట్రోలింగ్ పోలీసులు ఆదివారం ఎండల ధాటికి తట్టుకోలేక కాసేపు ఇలా సేదతీరారు.

– శ్రీకాకుళం క్రైమ్

### తాగునీటికి కటకట



పొన్నాడ పంచాయతీ ఎస్సీ కాలనీలో తాగునీటి సమస్య వెంటాడుతోంది. గుక్కెడు నీటి కోసం అర కిలోమీటరు వెళ్లి ఓ ప్రైవేటు ఇంటి నుంచి నీరు పట్టుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

### చిన్నారుల విజ్ఞాన యాత్ర



గార మండలం ఆడవరం ప్రాథమిక పాఠశాల హెచ్ఎం భోగెళ ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ఆదివారం విజ్ఞానయాత్ర నిర్వహించారు. శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్, గాంధీపార్కు, రిమ్స్, కేంద్ర గ్రంథాలయం, పురుషుల డిగ్రీ కళాశాల, సహాయ మాత చర్చి, జామియా మసీదు, శ్రీకాకుళం సెంట్రల్ లైన్స్ క్లబ్, అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాలను సందర్శించారు.

– శ్రీకాకుళం కల్చరల్

## సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి కృషి



ఎం.వి.రమణను సత్కరిస్తున్న రవికుమార్, జిల్లా, రాష్ట్ర సంఘ ప్రతినిధులు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో సాఫ్ట్‌బాల్ క్రీడాభివృద్ధికి చర్యలూ తీసుకుంటామని ఏపీ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ పేర్కొన్నారు. సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్, జిల్లా అధ్యక్షుడు కలిదిండి నరసింహరాజు అధ్యక్షతన ఆదివారం శ్రీకాకుళం 80ఫీట్ రోడ్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో 13 జిల్లాల సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ముఖ్య ప్రతినిధులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 13 జిల్లాలకు సాఫ్ట్‌బాల్ స్పోర్ట్స్ కిట్లను, క్రీడా దుస్తులను సమకూర్చుతానన్నారు. అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో పతకాలు సాధించిన/ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగాల కల్పనపై త్వరలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో మాట్లాడతానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా సౌత్‌జోన్‌లో ప్రథమ స్థానం, సీనియర్ నేషనల్స్‌లో 6వ స్థానంలో నిలిచి సూపర్ 8లోకి ఏపీ జట్లు చేరడం పట్ల సంఘ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘ జిల్లా చైర్మన్ బడగల హరిధరరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ సీఈఓ పి.సుందరరావు, జిల్లా పీడీ–పీఈటీ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.వి.రమణ, స్టేట్ సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి కె.నరసింహారెడ్డి, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ సీఈఓ సంపతిరావు సూరిబాబు, జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.వి.రమణ, గ్రిగ్స్ సెక్రటరీ కె.మాధవరావు, జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు మెట్ట తిరుపతిరావు, బొడ్డేపల్లి సురేష్, ఢిల్లీశ్వరరావు, ఆనంద్ కిరణ్, రాజగోపాల్, రాజశేఖర్, 13 జిల్లాల సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

### 26న అన్నమయ్య కీర్తనల ఆలాపన

శ్రీకాకుళం కల్చరల్: బలగ హరేరామ మందిరంలో ఈ నెల 26న తాళ్లపాక అన్నమాచార్యులు వర్ధంతి సందర్భంగా కీర్తనల ఆలపన నిర్వహిస్తున్నట్లు స్వరార్చన వాట్సాప్ గ్రూప్ నిర్వాహకులు సింహాద్రి శ్రీనివాసరావు తెలిపారు. అన్నమయ్యకు అష్టోత్తర శతనామావళి అనంతరం కార్యక్రమం ప్రారంభమవుతుందని, అభిమానులంతా పాల్గొనాలని కోరారు.